
కథ

# నాకెవ్వరూ లేరు!

## న్యాయపతి కమలారామ్‌జీ



అందమైన సాయంకాలం వేళ ఆర్.కె. బీచ్‌లో కూర్చుని వేడివేడి మిరపకాయ బజ్జీలు తింటూ సముద్రం మీద నుంచి వచ్చే కెరటాలని, దూరంగా నెమ్మదిగా సాగిపోతున్న స్టీమర్లని, అస్తమిస్తున్న సూర్యుడిని, ఆకాశంలో ఎగిరే పక్షుల్ని చూస్తూ ఇష్టమైన వాళ్లతో తీయని కబుర్లు చెప్పడంలోని థ్రిల్ మరెందులోనూ వుండదు! ఆ బీచ్‌లో అంజలి, మాధవ్ గువ్వ పిట్టల్లా పక్కపక్కనే ఒకరి దగ్గరగా మరొకరు కూర్చుని ఒకరి కళ్లల్లోకి ఒకరు ఈ ప్రపంచంతో సంబంధంలేనట్లుగా చూస్తూ వుండిపోయారు.

''అంజూ! నిన్ను భార్యగా పొందడం అన్నది నేను చేసుకున్న వేయి జన్మల పుణ్యఫలం. అదురుతున్న అధరాలని చూస్తే నాకేమనిపిస్తుందో తెలుసా? నీ నునుపైన చెక్కిళ్లు, మత్తుగా వుండే ఆ కళ్లూ.... ఓహ్... ఏదో ఏదో అయినది నాకేదో ఏదో అయినది....'' మంద్ర స్వరంతో పాట అందుకున్నాడు మాధవ్. తెల్లగా వుండే ఆమె చెక్కిళ్లు అతని పొగడ్తలతో అరుణోదయ కాంతుల్ని వెదజల్లసాగాయి. ఎర్రటి అధరాలు చిన్నగా వణకడం మొదలుపెట్టాయి. ఆమె కళ్లు అరక్షణం సిగ్గుతో వాలిపోయాయి.

"చాల్లెండి.. ఎవరైనా చూస్తారు..." ముద్దుగా కోప్పడింది అంజలి చుట్టూ చూస్తూ. మాధవ్‌కి ఆమెని ఒక్కసారి తాకాలని, గులాబి చెక్కిళ్లని ముద్దులతో ముంచెత్తాలని కోరిక కలిగింది. కాని అది బీచ్ అన్న వాస్తవం కళ్ల ముందు కదలగానే బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు.

★★★

ఆమెని పొగడ్డమే పనిగా పెట్టుకున్నాడు మాధవ్. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా అంజలిని నీడలా వెంటాడుతూ "నువ్వు లేని నేను లేను. నువ్వే నేను...నేనే నువ్వు..." అని చిలిపిగా పాడుతున్నప్పుడు ఆమె అందంగా హాయిగా నవ్వేది. ఆ నవ్వు కోటి వెన్నెల కాంతులు వెదజల్లినట్టుయ్యేది మాధవ్‌కి. " ఆమె తోడిదేలోకం. ఆమె లేనిదే జీవితమే లేదు" అన్నట్టుగా ఆమె వెనకే తిరగసాగాడు మాధవ్.

"దీన్ని ఏమంటారో తెలుసా?" ఒకరోజు అంజలి అంటే

"నువ్వే చెప్పు!" అన్నాడు ఆమె చేయి పట్టుకొని లాగుతూ...

"పిచ్చి అంటారు!" పాలగిన్నె కిందకు దించుతూ అంది నవ్వుతూ...

"పోనీ నువ్వు ఏ పేరు పెట్టినా సంతోషమే. కాని అంజలి! నిన్ను చూస్తుంటే అలా చూడాలనే అనిపిస్తుంది. ఒక పాలరాతి శిల్పం, ఒక మెరుపు తీగలా వున్న నిన్ను చూస్తుంటే భాష కందని భావాలెన్నో నాలో వూపిరి పోసుకుంటున్నాయి తెలుసా! అసలు ఆ సృష్టికర్త నిన్ను ఇంత అందంగా, అద్భుతంగా ఎలా తయారుచేసేడా? నాకోసమేనా? నేను నమ్మలేకపోతున్నాను..."

"అవునా? రేపు నాకేదైనా జరగరానిది జరిగితే... అహఁ.. మాటవరసకి అంటున్నాను. ఒక వేళ నాకేదైనా జబ్బుచేసి చనిపోతే అప్పుడు మీరెలా వుంటారు?..." ఆమె నోటిని తన చేత్తో గబుక్కున మూసేసి "పిచ్చిపిల్లా! హాస్యానికికూడా అలాంటి మాట అనకు. నేను తట్టుకోలేను. నీకు నేనున్నాను అంజూ! నీకేదైనా అయితే నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వేసి నిన్ను రక్షించుకుంటాను. నువ్వు లేని నేను లేను. బ్రతుకులోనూ, చావులోనూ కూడా ఇద్దరం కలిసే వుందాం. విడిపోయే ప్రసక్తి మన జీవితాల్లో రాకూడదు అంజూ!" అన్నాడు మాధవ్ ఆర్ద్రత నిండిన స్వరంతో. అంజలి కనుల నుంచి అప్రయత్నంగా రెండు నీటి చుక్కలు రాలాయి!

రాత్రి పూట డాబా మీద కూర్చుని ఆకాశంలో మెరిసే నక్షత్రాలని, మేఘాలతో దోబూచులాడుతున్న చందమామని చూడ్డం అదొక అద్భుత అనుభవం. రాత్రి ఇద్దరూ డాబా మీదికి చేరారు. ఆమె జడలో తురుముకున్న మల్లెలు పండువెన్నెలతో పోటీ పడుతున్నట్లుగా వున్నాయి. ఇద్దరూ గాలి కూడా చొరబడనంత దగ్గరగా కూర్చున్న వేళ అంజలి అంది. "మీరిలా అస్తమానం నన్ను పొగుడుతూ వుంటే నాకేదోలా వుంది."

"ఏం చెయ్యను? నా మనసు, నా నాలుక నా మాట వినడం లేదు. నిన్ను పొగడక పోతే నా నాలుక్కి కోపం వచ్చేస్తుంది. నీలాంటి అందగత్తెని నేను ఇప్పటి దాకా చూడలేదంటే నమ్ముతావా అంజూ! అపరంజి బొమ్మలాంటి మెరుపు తీగల గురించి, అప్సరసల గురించి, చందమామ పుస్తకాల్లో చదివాను. కాని నిన్ను పోల్చడానికి అవి సరి పోవనిపిస్తుంది. నీ అందాన్ని పొగడ్డం అసాధ్యం అనిపిస్తుంది." ఆమె జుట్టులోనికి వేళ్లు పోనిచ్చి సుతారంగా నిమురుతూ అంటున్నప్పుడు అతని హృదయం అనూహ్యమైన భావనతో నిండిపోయింది. రతీ-మన్మథుల్లా వాళ్లిద్దరూ శృంగార సామ్రాజ్యంలో ఓలలాడుతుండగానే సంవత్సరం గడిచిపోయింది.

"నేను వచ్చేస్తున్నాను. ఇంక మీ పప్పులుడకవు." అన్నట్టుగా వాళ్లిద్దరి మధ్యకి బుజ్జి తండ్రి ప్రవేశించాడు. వాడి ఆలనా-పాలనాతో క్షణం తీరిక లేకుండా వుంది అంజలికి. ఇటు రోజు రోజుకీ చిన్న పిల్లాడిలా అల్లరి చేస్తున్న భర్తని సంతోషపెట్టడం కూడా ముఖ్యమైన పనే ఆమెకి. పొద్దున్నించి రాత్రి దాకా పనితో అలసిపోతున్న అంజలి ఆరోగ్యం మీద అంత శ్రద్ధ చూపించలేకపోయింది.

"అంజూ! నువ్వు ఈ దీనుడ్ని మర్చిపోతున్నావు. చంటిగాడు వచ్చేక నన్ను పూర్తిగా పట్టించుకోవడం మానేసావు. ఇది చాలా అన్యాయం. నువ్వు వద్దంటున్న కొద్దీ నిన్ను హత్తుకుపోవాలనిపిస్తుంది. నీ చూపులో, నీ నడకలో, నీ మాటల్లో ఏ మత్తు వుందో కాని నన్ను పూర్తిగా చిత్తు చేస్తున్నాయి." ఆమె నడుం మీద చేయి వేస్తూ మత్తుగా అన్నాడు మాధవ్.

"ఊఁ చాల్లెండి...బుజ్జిగాడు చూస్తున్నాడు. మీకిద్దరికీ మరేం పని లేదా అంటున్నాడు. మీరిలా చేయడం వాడికిష్టం లేనట్టుంది. చూడండి. ఎలా గుక్కపట్టి ఏడుస్తున్నాడో" మృదువుగా పక్కకి తోసి పడుకుంది అంజలి.

బాబుకి ఏడాది నిండింది. వన్ ఇయర్ బర్త్‌డే సందర్భంగా వైశాఖ జల వుద్యానవనంలోని ఫంక్షన్ హాలు బుక్ చేసి తెలిసిన వాళ్లందర్నీ ఆహ్వానించాడు మాధవ్. ఆహుతులందరికీ ఘనంగా విందు ఏర్పాటు చేశారు ఆ దంపతులు. బాబుకి రెండేళ్లు కూడా నిండిపోయాయి. అంజలికి ఈ మధ్య వంట్లో బాగుండడం లేదు. తొందరగా అలసిపోతున్నది. రోజూ జ్వరం వస్తున్నది. వాంతులు అవతున్నాయి. కడుపు నొప్పిగా వుంటోంది. మొదట్లో ఆ విషయాన్ని ఆమె అంతగా పట్టించుకోలేదు. 'బుజ్జిగాడు పుట్టేక పన్లు ఎక్కువయాయి. అందుకే అలసిపోతున్నాను' అనుకుంది అంజలి. అంత అనారోగ్యంతో బాధపడుతున్న అంజలిని సరదాగా ఆటపట్టించాడు మాధవ్.

"అంజూ! ఏమిటి మళ్లీ రెడీనా? ఈ సారి నాకు పాప కావాలి" అంటూ మొదలుపెట్టేడు. అంజలి తలపట్టుకు కూర్చుంది.

"ఇది... అది కాదండీ. నిజంగా నా వంట్లో బాగోలేదండి. చూడండి. నా పాదాలు ఎలా వాచిపోతున్నాయో. ఒకసారి డాక్టరుకి చూపిస్తే మంచిదేమో" అంది అంజలి. ఆమె ముఖం వాడిపోయి వుంది. దగ్గర్లో వున్న డాక్టరు దగ్గరకి తీసుకెళ్లాడు మాధవ్ అంజలిని. డాక్టరు మాములుగా స్టెతస్కోప్ పెట్టి చూసేసి ఏవో కొన్ని మందులు రాసి ఇచ్చేడు. అంజలి ఎన్ని మందులు తిన్నా ఆమె ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణించిపోతూ వుంది. మాధవ్‌కి పిచ్చి పట్టినట్టుగా వుంది. ఒక చేత్తో చప్పట్లు అవవు! అంజలి సహకరిస్తే కదా తను ఆనందపుటంచుల్ని తాకడానికి ప్రయత్నించేది. అంజలి అనారోగ్యం అతనికి పెద్ద సమస్య అయిపోయింది.

"రాత్రి పూట మాటి మాటికి బాత్‌రూంకి వెళ్లాల్సివస్తోంది. కాళ్ల వాపులు తగ్గడం లేదు. జ్వరం కూడా వస్తోంది. వికారంగా వుంటోంది. తల తిరుగుతున్నది. హైబిపి వుందేమో. మొన్న చూసిన డాక్టరు ఏదీ సరిగ్గా డయగ్నైజ్ చేయ్యలేదేమో నాకు భయంగా వుంది" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది అంజలి. మాధవ్ చలించిపోయాడు.

అతనికి సడన్‌గా తన మిత్రుడు మూర్తి గుర్తుకొచ్చాడు. మాధవ్ వెంటనే అతనికి ఫోన్ చేసి భార్య గురించి వివరంగా చెప్పి సలహా అడిగాడు.

"ఒరేయ్ మాధవ్! నీ మిసెస్‌ను ఇక్కడికి తీసుకురా. నేను టెస్టులన్నీ చేసి రోగనిర్ధారణ చేసాక ట్రీట్‌మెంట్ మొదలుపెడతాను." అన్నాడు.

అంజలికి అవసరమైనవ పరీక్షలన్నీ విశాఖ మెడికల్ సెంటర్‌లో జరిగాయి. రిపోర్ట్స్ వచ్చాయి.

"నువ్వు రేపు మార్నింగ్ ఒకసారి రాగలవా మాధవ్!" అన్నాడు మూర్తి.

"ఒకే. నో ప్రాబ్లం. తప్పకుండా వస్తాను" అన్నాడు మాధవ్. మర్నాడు మాధవ్ ఒక్కడే డా.మూర్తిని కలవడానికి హాస్పిటల్‌కి వెళ్లాడు.

"మాధవ్! నేను నెఫ్రాలజిస్ట్‌ని. నేను చెప్పేది విని నువ్వు షాక్ అవకూడదు. అంజలికి రెండు కిడ్నీలు బాగా దెబ్బతిన్నాయి" మిత్రుడి వైపుచూసి అన్నాడు.

"ఓ మైగాడ్. అసలు ఈ కిడ్నీలు డామేజ్ అవడం ఏమిటి? ఎందుకిలా జరుగుతుంది?" తెల్లమొహం వేస్తూ ప్రశ్నించాడు.

"నీకు కిడ్నీ ఫంక్షనింగ్ గురించి వివరంగా చెప్తే తెలుస్తుంది. ఒక్క అంజలి అనే కాదు. మన దేశంలో ప్రతీ ఏటా 90వేల మందికి పైగా ఈ కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. వారిలో చాలా మంది కిడ్నీ డోనర్సు దొరక్క ఆ ఖర్చులు భరించలేక దుర్మరణం పాలవుతున్నారు. కిడ్నీ వ్యాధి ముందుగా గుర్తించేందుకు ప్రతీ ఒక్కరూ రెండు పరీక్షలు చేయించుకోవాలి. అవి రక్తంలో క్రియాటినైన్, మూత్రంలో ఆల్బుమిన్. ఈ రెండు పరీక్షల తర్వాత మూడోది మొదటి రెండు పరీక్షల ఆధారంగా లెక్కించే జిఎఫ్ఆర్(గ్లోమరులార్ ఫిల్టరేషన్ రేట్). ఇది ఒక్క నిమిషంలో మన కిడ్నీల్లోని వడపోత యంత్రాంగం ఎంత రక్తాన్ని వడకడుతుందో అంచనా వేసే పరీక్ష! రక్తంలో క్రియాటినైన్ 1.5 కంటే తక్కువ వుండాలి. ఈ జిఎఫ్ఆర్ కనీసం 100-120 ఎంఎల్ పర్ మినిట్ వుండాలి. జిఎఫ్ఆర్ 110కంటే

తక్కువకి పడిపోతే కిడ్నీసమస్య మొదలైనట్లే. యూరిన్‌లో అల్బుమిన్ ఎక్కువ పోతున్నదంటేనే కిడ్నీలు దెబ్బతిన్నాయని అర్థం. ఈ కిడ్నీలు బాగా పాడైపోతేనే వ్యాధి లక్షణాలు పైకి కనిపిస్తాయి. కాని అప్పటికే సమయం మించిపోతుంది. కిడ్నీలు దెబ్బతింటున్నాయని తెలిసిన వెంటనే ఎనలాప్రిల్, రామిప్రిల్ వంటి ఎసిఇ ఇన్‌హిబిటార్స్, లోసార్టాన్, వల్సాసర్టాన్ వంటి మందులను ఇవ్వడం ద్వారా కిడ్నీలు మరింత దెబ్బతినకుండా చూసుకోవచ్చు. కాని అంజలి విషయంలో అనుమానంగానే వుంది. ఆమెకి తెలియదుకాని, ఎప్పట్నుంచో ఈ కిడ్నీ వ్యాధి వుంది. ఆ విషయం పరీక్షల వల్ల తేలింది. నువ్వు ఆమెకు ఈ విషయాలన్నీ చెప్పకు. ముందు నుంచీ తెలిస్తే వెంటనే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం వుంది. ప్రస్తుతానికి మందులు వాడదాం. ఆ మందులు పని చెయ్యకపోతే అప్పుడు డయాలిసిస్ చెయ్యాల్సి వుంటుంది. అన్నట్లు మరొక విషయం..'' అంటూ ఆగాడు మూర్తి. ఏమిటన్నట్లు చూసాడు మాధవ్.

''అసలే నువ్వు శృంగార పురుషుడివి. అందమైన అమ్మాయి కనిపిస్తే చాలు వదలవు. అలాంటి నువ్వు....జాగ్రత్తగా వుండాలి సుమా. అంజలికి ఎలాంటి స్ట్రెయిన్ పనికి రాదు. ఆమెకి పూర్తి రెస్టు అవసరం తెలిసిందా!'' డాక్టర్ మూర్తి అన్నమాటకి మొహమాటంగా నవ్వేడు మాధవ్. డాక్టర్ మూర్తి చెప్పిందంతా వింటుంటే మాధవ్ మెదడు మొద్దుబారిపోయినట్లు అనిపించింది. గుండె అరల్లో ఓ విస్ఫోటం. మనసులో ఏ మూలో అంజలి తనని వదిలి ఎక్కడికో దూర తీరాలకి, తిరిగిరాని చోటుకి వెళ్లిపోతున్న ఫీలింగు!

ఇంటికి వచ్చిన మాధవ్ నవ్వుని ముఖానికి పులుముకుని సంతోషంగా వున్నట్లు నటించసాగాడు. అంజలికి ఆ మందులు ఏమాత్రం పనిచెయ్యలేదు. రోజు రోజుకీ నీరసించిపోతున్నది. కాళ్లు బాగా వాచిపోయి వున్నాయి. ఏ పని మీదా శ్రద్ధ లేదు. బాబుని కూడా సరిగ్గా చూసుకోలేకపోతున్నది. డాక్టర్ మూర్తి అంజలికి డయాలసిస్ చెయ్యాలని చెప్పాడు. మాధవ్ ఇరకాటంలో పడ్డాడు. డయాలసిస్ అంటే ఏమిటో, ఎప్పుడు ఎందుకు ఇస్తారో ఆమెకి బాగానే తెలుసు. అందుకే అంజలికి చెప్పడానికి సంకోచిస్తున్నాడు మాధవ్.

కోడలికి వంట్లో బాగా లేదని తెలిసి చూడ్డానికి వచ్చారు. విజయనగరంలో వున్న మాధవ్ తండ్రి భాస్కరమూర్తి. ఆయన పెద్దాయన. అనుభవజ్ఞుడు. ఆయన కెందుకో అంజలి ఇంక అట్టే కాలం బతకదని తెలిసిపోయింది. కొడుకు మీద విపరీతమైన సానుభూతి కలిగింది. కొడుకుని పక్కకి పిలిచి 'నీ కేంటిరా ఈ ఖర్మ?' అన్నారాయన నొచ్చుకుంటూ.

''ఏం చేస్తాం నాన్నగారూ? విధిరాత. ఎలా వుంటే అలా జరుగుతుంది. మనం నిమిత్త మాత్రులం'' అన్నాడు మాధవ్ విరక్తిగా. అతని మెదడంతా చిక్కులు పడిన దారంలా గజిబిజిగా తయారైంది. రెండు రోజుల క్రితం డాక్టరు మూర్తిని కలిసేడు మాధవ్. తన కిడ్నీ డొనేట్ చెయ్యడానికి వీలు అవుతుందోమోనని అడిగాడు. మాధవ్ బ్లడ్ గ్రూప్ కలవలేదు. కిడ్నీలు ఇచ్చే దాతలు ఎవరూ లేరు. దగ్గర వాళ్లు అని చెప్పుకోదగ్గ వాళ్లు లేరు. అందుకే అలా విచారంగా వున్నాడు.

''చక్కని చుక్క అని ఇష్టపడి చేసుకున్నావు ఏమైంది. జబ్బు పిల్లని అంటగట్టారు వాళ్లు'' భాస్కర మూర్తి రుసరుసలాడాడు.

''మన చేతుల్లో ఏంలేదు నాన్నగారూ!'' ప్రపంచంలోని నైరాశ్యమంతా గూడుకట్టుకుని వుంది మాధవరావు మాటల్లో.

భాస్కరమూర్తి బుర్ర పాదరసంలా పని చెయ్యసాగింది.

''నిన్నిలా చూస్తుంటే నా మనసు తరుక్కుపోతోందిరా. నేను చెప్పినట్లు చెయ్యి'' కొడుకు చెవిలో ఏదో గొణిగాడు ఆయన. వినకూడని మాట వింటున్నట్లుగా శిలాప్రతిమలా బిగుసుకుపోయాడు మాధవ్.

''తప్పదురా...పెద్దవాడిని. నీ మంచి కోరే చెపుతున్నాను'' అని కృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసినట్లు రకరకాలుగా నచ్చజెప్పి హితబోధలు చేసాడు.

★★★

అంజలికి డయాలసిస్ మొదలుపెట్టారు డాక్టర్లు. రెండు వారాలకొకసారి డయాలసిస్ చేస్తున్నారు. అంజలికి నీరసంగా, నిస్సత్తువుగా ఎప్పుడూ మంచం మీద పడుకునే వుంటోంది. భాస్కరమూర్తి విజయనగరం వెళ్లే ముందు కొడుకుతో రహస్యంగా ఏదో మాట్లాడాడు. అతను వెళ్లిన వారం రోజులకు ఒక రోజు మాధవ్...

''అంజలి! నాకు పని వుంది. విజయనగరం వెళ్లి రావాలి. ఒక్కరోజులో వచ్చేస్తాను. అందాకా నీకు సహాయంగా పక్కింటి ఆంటీని వుండమని చెప్పాను'' అన్నాడు వూరికి వెళుతూ.. మర్నాడు మాధవ్ తిరిగివచ్చేసాడు. పది రోజుల తరువాత భాస్కరమూర్తి మళ్లీ వచ్చేడు. ఈసారి అతను ఒక్కడూ రాలేదు. వెంట ఒక అమ్మాయిని తీసుకొచ్చాడు.

''అంజలీ! ఈ అమ్మాయి పేరు గీత. ఈ అమ్మాయికి పాపం నా అన్నవాళ్లెవరూ లేరు. ఒక ముసలి బామ్మ వుండేది. పదిరోజుల క్రితం ఆవిడ మరణించింది. ఇంటిపనికి, వంటపనికి, బాబుని చూసుకోవడానికి సాయంగా వుంటుందని తెచ్చానమ్మా'' అన్నారాయన గీతని అంజలికి పరిచయం చేస్తూ. గీత మొహమాటంగా బెదురు కళ్లతో చూసి తలదించుకుంది. అంజలి ఏమీ మాట్లాడలేదు. కాని గీత వచ్చిన దగ్గర్నుంచీ ఇటు శారీరకమైన అనారోగ్యంతో పాటు మానసికంగా కూడా కృంగిపోయే సంఘటనలు ఒకటి తర్వాత ఒకటి ఎదురవుతున్నాయి ఇంట్లో.

★★★

గీత వచ్చిన తరువాత మాధవ్ చిత్రంగా మారిపోయాడు. ఇది వరకు ఎంత సేపూ 'అంజలీ! అంజలీ!' అంటూ సూర్యుడి చుట్టూ తిరిగే భూమిలాగా ఆమె చుట్టూ తిరిగేవాడు. అలాంటిది ఇప్పుడు అంజలిని పట్టించుకోవడం లేదు. అంజలి అతన్ని పిల్చినా వచ్చి ఏదో అర్జంటు పని వున్న వాడిలా అర నిమిషంలో తిరిగి వెళ్లిపోతున్నాడు. అతని వైఖరి అంజలికి ఏమి అంతుపట్టడం లేదు. అంజలి రూపమే మారిపోయిందని, గాలి తీసేసిన బెలూన్‌లా తయారైందని, జీవకళ పోయి మొహం పేలవంగా వుందని, కళ్లు కాంతివిహీనంగా వున్నాయని ఆమెకి తెలియదు. మాధవ్ ప్రవర్తనకి అందుకే ఆశ్చర్యపోతున్నది. మాధవ్ 'గీతా!గీతా' అంటూ ప్రతీ పనికీ గీతని పిలవడం అలవాటు చేసుకుంటున్నాడు.

''గీతా! తలకి కొంచెం కొబ్బరి నూనె రాయి.''


''గీతా! నా షర్టు గుండీ వూడిపోయింది. కుట్టి పెట్టు.''

''గీతా! ఆఫీసుకి టైమైపోతోంది. తొందరగా వడ్డించు.''

''గీతా! నా పెన్ కనబడ్డం లేదు. కొంచెం వెతికి పెట్టు.''

అన్నింటికీ గీతే! మరి తన పరిస్థితి ఏమిటి? ఇంతేనా?

''తననెందుకు మాటి మాటికి పిలుస్తారు? నేను చేస్తానండి. నాకు చెప్పండి. మీకేం కావాలి?'' అంది అంజలి గొంతు నిండా బాధ గూడుకట్టుకొని



వుండగా.

"అంజలీ! నీకెందుకు శ్రమ! డాక్టరు నిన్ను బాగా రెస్టు తీసుకోమన్నారు. నువ్వసలు మంచం మీంచి కదలకూడదు. ఎవరు చేస్తేనేమిటి? నా పన్లు అవడం కావాలిగాని. అలాంటివన్నీ పట్టించుకోకు. టేకిట్ ఈజీ. వెళ్లు. వెళ్లి పడుకో!" సాధ్యమైనంత మృదువుగానే అన్నాడు మాధవ్.

★★★

మంచినీళ్ల కోసం లేచింది అంజలి. ఏవో గుసగుసలు వినిపించాయి.

"గీతా! సాయంత్రం సినిమాకెళదాం. నేనొచ్చేసరికి రెడీగా వుండు" మాధవ్ గీతతో నెమ్మదిగా అంటున్నాడు. అతను ఎంత నెమ్మదిగా అన్నా ఆ మాటలు అంజలికి స్పష్టంగా వినిపించాయి.

"ఏం జరుగుతోంది ఈ ఇంట్లో? ఆయన ఇంతలా మారిపోయేరేంటి? తనేం చెయ్యాలి? భర్తతో గొడవ పెట్టుకోవాలా? గొడవ పెట్టుకుంటే ఏమవుతుంది? అసలు ఆ గీత ఎవరు? ఎందుకొచ్చింది? నిజంగా బాబుపన్లు ఇంటి పన్లు చూసుకోవడానికే వచ్చిందా? ప్రతి పనికీ మాధవ్ గీతనే పిలుస్తున్నాడెందుకు? తనెందుకూ పనికిరాదా? తన మంచం కూడా హాలులో ఓ మూల వేసారు. గాలి, వెలుతురు బాగా వుంటే తొందర్లో ఆరోగ్యం కుదుటపడుతుందని డాక్టరు చెప్పారని మాధవ్ అన్నాడు. అంతా మూగదానిలా చూస్తూ కూర్చోవడమేనా తన పని!" ఆమె బుర్రలో లక్ష ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

సాయంత్రం మాధవ్ ఇంటికి రాగానే అందంగా ముస్తాబై నవ్వుతూ ఎదురొచ్చిన గీతని చూసి రెప్ప వేయడం మరిచిపోయినవాడిలా అలా చూస్తుండిపోయాడు. అంజలి ఆ దృశ్యం చూసి తట్టుకోలేకపోయింది. ఆమె మనసు మూగగా రోదించింది. ఇంట్లోంచి బయల్దేరేటప్పుడు మామూలుగా వున్నా కొంచెం దూరం వెళ్లగానే మాధవ్ గీత భుజం మీద చెయ్యి వేసి నడవడం అంజలి దృష్టిని దాటిపోలేదు. ఆమె మనసు భగ్గున మండిపోయింది. ప్రపంచంలో ఎవరికీ జబ్బులు రావా? అదే తన భర్తకి వస్తే తను ఇలాగే పట్టించుకోకుండా వుంటుందా? ఇవ్వాళ ఎలాగైనా గీత విషయం తేల్చేయాలని నిశ్చయించుకుంది అంజలి. రాత్రి వాళ్లు సినిమా నుంచి రాగానే తన కోపాన్ని అణుచుకుంటూ "ఏమండీ! ఒకసారి ఇలా వస్తారా?" భర్తను పిలిచింది.

"ఏంటి? ఆ చెప్పేదేదో త్వరగా చెప్పు. నాకు నిద్రవస్తోంది. పడుకోవాలి." ఆమెతో మాట్లాడడం ఇష్టం లేనట్టుగా ముఖం పెట్టి కసురుకున్నాడు" అంజలికి ఏడుపు వచ్చింది.

"మీ వ్యవహారం నాకేమీ అంతుపట్టడం లేదు. మీరు చెయ్యాల్సిన పనేనా ఇది?" గొంతులోని దుఃఖాన్ని అదిమిపట్టి గద్గద స్వరంతో అంది అంజలి.

"మనసులో ఎలాంటి విషయాలు పెట్టుకోకుండా ప్రశాంతంగా పడుకో" అనేసి వెంటనే వెళ్లిపోయాడు మాధవ్. ఆ వెళ్లడం తిన్నగా గీత గదిలోకి వెళ్లాడు. అంజలికి స్వేద రంధ్రల్లో సూదులు గుచ్చుకున్నట్లు అనిపించింది. శారీరకంగా, మానసికంగా ఆమె మనసు బాగా దెబ్బతింది. కుమిలి కుమిలి ఏడ్వడం, బాధపడడం, అన్నం తినకపోవడం, డయాలసిస్‌కి వెళ్లనని మొండికెయ్యడం తప్ప ఆమె ఇంకేం చెయ్యలేదు! ఆమె తిన్నా తినకపోయినా పట్టించుకునేవాళ్లు ఎవరు లేరు. పరిస్థితి అదుపు తప్పి పోయింది. తన జబ్బు నయం కావాలని ఆ దేవుడ్ని ప్రార్థించినా అది నయం కాని జబ్బు అని తనకి బాగా తెలుసు. ఈ రోజుల్లో ఎంతో మంది బాబాలు, అమ్మలు భక్తుల పూజలందుకుంటున్నా ఇలాంటి జబ్బుల్ని నయం చేసే దాఖలాలు లేవు.

ఆ రోజు అంజలి మావగార్ని నిలదీసి అడిగింది. "ఏం జరుగుతోంది ఈ ఇంట్లో? ఈ గీత ఎవరు? తను వచ్చాక నా భర్త పూర్తిగా మారిపోయారు. నా రక్తం మరిగిపోతోంది. ఎప్పుడో రావలసిన మరణం ఇప్పుడే వచ్చేటట్టుంది. నాకు నిజం తెలియాలి చెప్పండి" పిచ్చి పట్టినట్లుగా వూగిపోతూ గట్టిగా అరిచింది అంజలి.

భాస్కర మూర్తి అప్పుడు పెదవి విప్పాడు. 'అంజలీ! నీది నయం కాని జబ్బు. మాధవ్ బ్రతుకు నీ కారణంగా శూన్యమైపోవడం నాకిష్టం లేదు. నిజంగా నీకు నీ భర్త పట్ల అనురాగం, ప్రేమ వుంటే భర్త సుఖమే కోరుకునేదానివైతే నీలో త్యాగ బుద్ధి కూడా వుండాలి. గీత మన బంధువుల అమ్మాయి. మంచి పిల్ల. వాళ్ల బామ్మ చనిపోతూ చివరి కోరిక కోరింది, మనవరాలి పెళ్లి చూడాలని. అందుకే అర్జంటుగా మాధవ్‌కి గీతతో గుడిలో పెళ్లి జరిపించాను. నీకు ముందుగా చెపితే నువ్వు కాదంటావు. నీ జీవితం ముగియబోతున్న తరుణంలో నీ భర్త సుఖం కోరడం నీ ధర్మం. వాడి జీవితానికి దారి చూపడం నీ కర్తవ్యం..." ఇంకా ఏదో చెప్పబోయాడు భాస్కరమూర్తి.

"ఆపండి...మీరు ధర్మాలు చెపుతున్నారా? చావు బ్రతుకుల మధ్యనున్న భార్యకి 'నీకు నేనున్నా' అని ఓదార్చి ఆదుకోవడం పోయి పరాయి భామతో కులకడం ధర్మమా? 'నువ్వు లేనిదే నేను లేను' అని అనవసరంగా అతిగా పొగిడి లేనిపోని ఆశల్ని నాలో కల్పించి నాకు జబ్బు చెయ్యగానే తెలివిగా తప్పుకోవడం ధర్మమా? మృత్యువుతో పోరాడుతున్న కోడలికి నాలుగు సాంత్వన వచనాలు పలకడం బదులు ఆమె మనసు ముక్కలు అవుతున్నా పట్టించుకోకుండా, కనీసం 'మానవత్వం' అయినా లేకుండా కొడుక్కి గుట్టు చప్పుడు కాకుండా మరో పెళ్లి చెయ్యడం ధర్మమా? ఏది ధర్మం? మీరు 'ధర్మాలు' గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా వుంది! మీరంతా కలిసి నాకు అన్యాయం చేసారు. మీరు మనుషులు కారు. మానవ రూపంలో వున్న అందమైన మృగాలు! అదే జబ్బు తనకి వస్తే నేను వూరుకోగలనా? మగాడికొక న్యాయమా? ఆడదానికొక న్యాయమునా? కన్నీటిని తుడవాల్సిన భర్తే ఆ కన్నీటికి కారణం అవుతూంటే ఇక ఆ భార్య కన్నీరు తుడిచేదెవరు? మీరంతా నా మరణం కోసం ఎదురు చూస్తున్నారన్నమాట! చాలా సంతోషం! మృత్యువు నన్ను కౌగిలించుకుంటున్నదని తెలిసినప్పుడు నన్ను ఎంతో అపురూపంగా చూసుకునే భర్తని వదిలి ఎలా వెళ్లగలను? అని బాధపడ్డాను. థాంక్ గాడ్! ఇప్పుడా బాధ లేదు. నాకెవ్వరూ లేరు. ఎవ్వరూ లేరు!" వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది అంజలి. వాళ్లు ముగ్గురూ అలా స్థబ్దుగా వుండిపోయారు.

***మనిషి దాట లేనిది మృత్యువునే!***
***మనిషి భయపడేది మృత్యువుకే!***

ఎప్పుడో ఒకప్పుడు అందరూ ఈ లోకం నుంచి నిష్క్రమించేవాళ్లే! ఒక్క ఆరు నెలలు ఓపిక పట్టివుంటే తను చనిపోయాక పెళ్లిచేసుకొని వుంటే తన మనసు ఇంత గాయపడి వుండేదికాదు. మనసుని ముక్కలు చేస్తున్న చేదు అనుభూతులు వుండేవి కావు. తను బ్రతికి వుండగానే తొందరపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం అన్యాయం! అక్రమం!అమానుషం!... ఆమె ఏడ్చి ఏడ్చి అలసిపోయింది. ఏమయిందో తెలీదు కాని మర్నాడు పొద్దున్నే చూసేసరికి అంజలి పంచప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

★

